క్లుప్తంగా

నేడు వాసవీమాత జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: వాసవీమాత జయంతి పురస్కరించుకొని పట్టణంలోని వాసవి మందిర్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం 8 గంటలకు అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, 10.30 గంటలకు కుంకుమ పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు మంగళ హారతి, మహా మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు వాసవీమాత విగ్రహంతో పట్టణంలో శోభాయాత్ర, రాత్రి 7 గంటలకు ఊయల సేవ, రాత్రి 8 గంటల నుంచి మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై వాసవీమాత కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీజేపీలో చేరికలు



బీజేపీ తీర్థం పుచ్చుకున్న అంకుసాపూర్ వాసులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన 55మంది మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకొని బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆకర్షితులై పార్టీకి మద్దతుగా ఉండాలన్న ఉద్దేశంతో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో పోల్కర్ రాము, ప్రభాకర్, సకారాం, గణపతి, మురళి, యువత ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, వెంకన్న, ప్రహ్లాద్, ప్రసాద్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

వాంకిడి: మండల కేంద్రంలోని నాలుగు వరుసల జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున బొగ్గు లోడ్‌తో వెళ్లే లారీ అదుపుతప్పి బోల్తా పడింది. అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రహదారిపై గల సోలార్ లైట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో లారీ బోల్తా పడింది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జవడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా రహదారిపై గల విద్యుత్ స్తంభం, స్పీడ్ బ్రేకర్‌లకు అమర్చిన భారీ ఇనుప స్తంభాలు ముక్కలుగా విరిగి సర్వీస్‌రోడ్డుపై పడ్డాయి. లారీ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను మంగళవారం కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని శీర్షా, కనికి, గురుడుపేట, తలోడి గ్రామ పంచాయతీల్లోని అభ్యర్థుల పత్రాలను ఎంపీడీవో రమేశ్, ఏపీవో ముక్తేశ్వర్, టీజీబీ బ్యాంకు మేనేజర్ రమేశ్, అధికారులు మడావి పోచాని పరిశీలించారు. నేడు మొగడ్‌దగడ్, తాటినగర్, తాటిపల్లి, నాగేపల్లి గ్రామ పంచాయతీల్లోని అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని, సకాలంలో దరఖాస్తుదారులు హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

ఖిర్డీకి బీటీరోడ్డు పనులు ప్రారంభించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండలం ఖిర్డీ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్‌లు మాట్లాడుతూ ఖిర్డి గ్రామానికి బీటీరోడ్డు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో నడవలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. వంతెనలు లేకపోవడంతో వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తుందని, దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. 1.5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు సమాచారం ఉందని, ఆ నిధుల ద్వారా ఖిర్డీకి బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వారు కోరారు.

పంట చుట్టూ ప్రమాదం!

- వ్యవసాయ చేలకు రక్షణగా విద్యుత్ కంచెలు
- వన్యప్రాణుల వేట కోసం అమర్చుతున్న మరికొందరు
- తీగలకు తగిలి పలువురు మృత్యువాత



సిర్పూర్(టి): రైతులు తమ పంటలను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతుంటారు. ఇందులో భాగంగా కొందరు తమ పంట చేల చుట్టూ సోలార్ విద్యుత్ తీగలు అమర్చుకుంటారు. విద్యుత్ తీగలు అమర్చడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా పంటను కాపాడుకోవాలని దొంగచాటుగా అటవీప్రాంతాలకు ఆనుకొని ఉన్న పంట చేలకు రాత్రి వేళల్లో విద్యుత్ తీగలు అమర్చి ఇంటికి వస్తుంటారు. అయితే విద్యుత్ తీగలు ఉన్న విషయం తెలియక అటుగా వెళ్లిన వారు విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడుతున్నారు. సిర్పూర్(టి) మండలంతో పాటు కౌటాల, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాల్లో సైతం పలుమార్లు పొలాల చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు తగిలి పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

వేట కోసం..

ఒక వైపు పంట పొలాల రక్షణకు రైతులు విద్యుత్ తీగలు అమర్చుతుండగా మరోవైపు అటవీప్రాంతాలకు ఆనుకొని ఉన్న గ్రామాలకు చెందిన పలువురు వన్యప్రాణుల వేట కోసం రాత్రి వేళల్లో విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. ఈనేపథ్యంలో విద్యుత్‌తీగలు అమర్చిన వారే ఆదమరిచి విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నాయి. అటవీశాఖ అధికారులు ప్రతినిత్యం గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండడం లేదు. అటవీశాఖ అధికారులు సంబంధితులపై కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

అధికారులు ఏమైనా సంఘటనలు నెలకొన్న సమయంలోనే గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారే తప్పా తర్వాత నివారణ చర్యలు మాత్రం తీసుకోవడంలేదు. అటవీశాఖ అధికారులు కానీ, విద్యుత్ శాఖ అధికారులు కానీ పకడ్బందీగా చర్యలు తీసుకోకపోవడం మూలంగానే తరుచూ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందుతున్న సంఘటనలు నెలకొంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యుత్ వైర్లు అమర్చి వన్యప్రాణులను వేటాడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో పలు ఘటనలు..

- ఏప్రిల్ 11న మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్ (19) అనే యువకుడు తమ పంట చేనుకు తన తండ్రి అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాడు. కొడుకు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందడంతో కేసులు నమోదవుతాయనే భయంతో తండ్రి కొడుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న పెన్‌గంగ నదిలో పడేశాడు.
- సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన లావుడ్యే నరేశ్ (18) అనే యువకుడు మూడు సంవత్సరాల క్రితం చింతకుంట అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.
- గతంలో పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన లచ్చన్న(45) వన్యప్రాణుల వేట కోసం తానే అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాడు. రాత్రి విద్యుత్ తీగలు అమర్చి ఉదయం వెళ్లి ఆదమర్చి తీగలకు తగిలి మృతి చెందాడు.

రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల రైల్వే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వందలాది మంది ప్రయాణికులతో సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రైల్వే రంగంలో ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలవుతున్నాయని ఆరోపించారు. పర్మినెంట్ సిబ్బందిపై పనిభారం తీవ్రంగా పెరిగిందని పేర్కొన్నారు. రైల్వే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర సిబ్బందికి ఉద్యోగ భద్రత కొరవడిందని, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, సభ్యులు చంద్రన్న, సంజీవ్, శంకరమ్మ, రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



జిల్లా కేంద్రంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: శాస్త్రీయ పద్ధతిలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీ మేల్కొలుపు యాత్ర జిల్లా కేంద్రం మీదుగా మంగళవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ విద్య, వ్యాపార రంగాల్లో బీసీలకు జనాభా ప్రతిపాదికన అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వాంకిడి మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించార. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్, నాయకులు వెంకన్న, ఆవిడపు ప్రణయ్, సాయికుమార్, భాస్కర్, మధుసూదన్, లక్ష్మణరావు, బాలేశ్, శంకర్, తరుణ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని పశువులు మృతి

రెబ్బెన: మండలంలోని గోలేటి సీహెచ్‌పీ సమీపంలో రైల్వేట్రాకుపై దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టి నాలుగు పశువులు మృతి చెందినట్లు బెల్లంపల్లి ఆర్పీఎఫ్ ఏఎస్సై మోహన్ రాథోడ్ తెలిపారు. మంగళవారం మృతి చెందిన పశువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్, రేచిని రోడ్ రైల్వేస్టేషన్ మధ్యలో రెబ్బెన మండల పరిధి గోలేటి సీహెచ్‌పీ సమీపంలో నాలుగు పశువులు రైలుపట్టాలు దాటుతుండగా దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతి చెందాయని తెలిపారు. గ్రామస్తులు, పశువుల యజమానులు తమ పశువులు రైలు పట్టాల వైపు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులను పట్టాల వైపు వదిలినా, రైల్వే ప్రమాదాలకు కారణమైన పశువుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్‌దీపాల పంపిణీ



సోలార్ విద్యుత్ దీపాలు అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

రెబ్బెన: మండలంలోని తుంగెడ గ్రామంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ దీపాలను కార్పొరేషన్ డీఎం శ్రీవాణి, ఎఫ్ఆర్వో లక్ష్మణ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తుంగెడ గ్రామంలో ప్రజల సౌకర్యం కోసం సోలార్ విద్యుత్ దీపాలను అందచేస్తున్నట్లు డీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెంటయ్య, పర్వతాలు, మాజీ ఉపసర్పంచ్ సాయికృష్ణ, మాజీ ఎంపీటీసీ జయకర్, నాయకులు పూదరీ హరీశ్, ధర్మయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం



జాడి కార్తికను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన జాడి కార్తిక్, అతని తల్లిదండ్రులు జాడి గోపాల్, లక్ష్మిబాయిలను అంబేడ్కర్ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో పలువురు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభను కనబర్చడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయుడు ఉప్రె వినేష్ డిక్షనరీ బహూకరించారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఉపాధ్యక్షుడు వినేశ్, ఆర్గనైజర్ విజేయ్ ఉప్రె, అంబేడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఎస్ఎస్‌డి ఇన్‌చార్జి దుర్గం సందీప్ పాల్గొన్నారు.

పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ఉపాధిహామీ కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల ఎంపీడీవో బి.రమేశ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని తెలిపారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతీఒక్కరు వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలని తెలిపారు. రైతులు చేనుల్లో ఉపాధిహామీ పనులు చేయించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఉదయం పని ప్రదేశానికి వచ్చి ఎండ వేడి పెరగక ముందే పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు సాయికృష్ణ, రమేశ్, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ఎస్సై ప్రవీణ్ కుమార్ మంగళవారం బాధితులకు అందజేశారు. ఏటిగూడకు చెందిన జక్కం శ్రీశైలం, బారెగూడకు చెందిన కంది శ్రీహరిలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా ట్రేస్‌చేసి ఫోన్‌లు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశామన్నారు. ప్రజలు ఎవరైనా ఫోన్‌లు పోగొట్టుకుంటే పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా ఫోన్ తిరిగి పొందవచ్చని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు వినతి



మాట్లాడుతున్న మహిన్ నీదా, నూరి సభ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు మహిన్ నీదా, నూరి సభ, ముస్తాఫాలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తమకు ఇంటి స్థలం ఉన్నా సొంతగా ఇల్లు కట్టుకునే స్థోమత లేదన్నారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదన్నారు. తమ తల్లిదండ్రులు మరణించి 10 సంవత్సరాలు దాటిందని, తమకు ఎవరూ లేరని, ప్రభుత్వమే అండగా నిలవాలని కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ పేదరికాన్ని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

సొంత భవనాలు కరువు

- తిప్పలు పడుతున్న పొదుపు సంఘాల సభ్యులు
- శిథిలావస్థ భవనాల్లో సమావేశాల నిర్వహణ
- పక్కా భవనం మంజూరు చేయాలని వేడుకోలు



ఇంటి ఆవరణలో నిర్వహిస్తున్న పొదుపు సంఘం సమావేశం (ఫైల్)

లింగాపూర్: మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేక సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామైక్య సంఘాలకు భవనాలు నిర్మించాలని సభ్యులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. సమావేశాల నిర్వహణకు సరైనా వేదిక లేకపోవడంతో చెట్ల కింద, ఇంటి ఆవరణలో, రైతు వేదికల్లో సంఘ సభ్యుల సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో 18 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 271 స్వయం సహాయక సంఘాలు ఉండగా, మూడు దివ్యాంగుల సంఘాలు ఉన్నాయి. వాటిలో 3,208 మంది సభ్యులు ఉన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు జీవనోపాధి పొందుతూనే పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లలో సభ్యులకు చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించే సంఘాలకు సొంత భవనం లేదు. ఫలితంగా ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు.

అనేక సమస్యలు..

సొంత భవనాలు లేక సంఘాల కార్యక్రమాల నిర్వహణతో మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైక్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చే మహిళ సంఘాల సభ్యులకు మరుగుదొడ్లు, బాత్‌రూం వంటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. లింగాపూర్ మండల కేంద్రంలో గత ఎనిమిదేళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనంలో జై జగదాంబ మండల సమాఖ్య కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. స్థానికంగా మహిళా సంఘం కోసం పక్కా భవనాన్ని నిర్మించాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు సైతం..

2016లో నూతనంగా ఏర్పాటైనా లింగాపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సైతం పక్కా భవనాలు కరువయ్యాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ భవనం పురాతన పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ భవనంలో నిర్వహిస్తుండడంతో సౌకర్యాలు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..



స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కానీ నేటికీ సొంత భవనాన్ని నిర్మించలేదు. సంఘాల సభ్యులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశాం.

– తిరుపతి, ఏపీఎం, లింగాపూర్

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'

నార్నూర్: హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేద ప్రజలను మోసం చేస్తోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేద ప్రజలకు అండగా ఉన్నారని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో రూ, 1,00116 ఇవ్వడంతో పాటు తులం బంగారం ఇస్తామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ, 15వేలు ఇస్తామని హామీతో ఇచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. అనంతరం లోకారి(కె) గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలి

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: బంగారు తెలంగాణను బంజరు రాష్ట్రంగా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఆయన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వేసిన కమిటీలు కేవలం కాంగ్రెస్ కార్యకర్తల కోసమే పని చేస్తున్నాయని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఆకస్మాత్తుగా ప్రభుత్వం సిబిల్ స్కోర్ ఉండాలని షరతులు విధించడం అన్యాయమన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందు ప్రవీణ్‌కుమార్‌ను స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న భూమేశ్వర్

బెజ్జూర్: రైతు నుంచి ప్రతీ గింజను కొనుగోలు చేయాలని బెజ్జూర్ తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. తేమ చూసి ప్రతీరైతు నుంచి వడ్లు కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, వరి కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను విక్రయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీఎం జగదీశ్ ఉన్నారు.